సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం। 25। ఆగస్టు। 2023



బందీ నుంచి బడుల్లోకి..
బడికి వెళ్లాల్సిన పిల్లలు పనుల్లో కనిపించొద్దని 'ఆపరేషన్ ముస్కాన్', 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. 8లో



యూరియా కోసం పడిగాపులు
హత్నూర మండలంలో యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. 9లో

13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు
పటానచెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 10 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం



ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్ నాయకులు, కార్యకర్తలతో ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి బయలుదేరారు. వారు క్యాంపు కార్యాలయం సమీపంలోకి రాగానే ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, సిబ్బంది అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమను అడ్డుకోవడాన్ని విజయ్‌పాల్‌రెడ్డి, సంగప్ప తప్పుబట్టారు.

జీతాల కోసం అభియాన్ ఉద్యోగుల వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: 'మాకు జీతాలు రావడం లేదని' జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకు సమగ్ర శిక్ష జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మధురనేని శేషాద్రి, సభ్యులు వినతిపత్రం అందజేశారు. గురువారం పట్టణానికి వచ్చిన డీఈఓను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన తన వంతుగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారని సమగ్ర శిక్షా జాక్ సభ్యులు పేర్కొన్నారు. జిల్లాలోని అభియాన్ ఉద్యోగులు ఇటీవల బదిలీలు కావడం తెలిసిందే. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, సభ్యులు ఉమా, భాస్కర్, మల్లేశం, యాదయ్య, సుకన్య, రామకృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



విద్యార్థిని సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): నాసా అంతరిక్ష పరిశోధన సంస్థకు వెళ్లి వచ్చిన హత్నూరకు చెందిన 13 ఏళ్ల బాలుడు, తొమ్మిదో తరగతి విద్యార్థి అబ్దుల్ ఫుర్కాన్‌ను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అభినందన సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాసా ఇంటర్నేషనల్ ఐఎస్డీసీ.. స్పేస్ డెవలప్మెంట్ కాన్ఫరెన్స్ 2023 ఆహ్వాన పత్రం అందుకున్నాడన్నారు. ఎలిసియం ప్లానెట్‌పై రిసెర్చ్ చేస్తుండటం అభినందనీయమన్నారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, ఎస్.కుమార్, విద్యార్థి తండ్రి అబ్దుల్ వహీద్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టండి



ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో అక్రమార్కులు కొందరు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాత్రిపూట గుట్టల్లో ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వెంచర్లకు, ప్లాట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు సత్యం, నాగరత్నం గౌడ్, రవీంద్ర గౌడ్, వెంకటేశం, లక్ష్మణ్, షకీల్ పాల్గొన్నారు.

టికెట్ పోరు.. పైరవీల జోరు

'నర్సాపూర్'పై కొనసాగుతున్న ఉత్కంఠ

- రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం
- మదన్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి హరీశ్‌రావుతో వేర్వేరుగా భేటీలు
- ఆసక్తికరంగా పోటాపోటీ రాజకీయాలు



ఎమ్మెల్యే మదన్‌రెడ్డితోపాటు అనుచరులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ నర్సాపూర్ నియోజకవర్గం అభ్యర్థిత్వంపై నెలకొన్న సస్పెన్స్ ఒకటెండ్రోజుల్లో వీడే అవకాశం ఉందన్న అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. నర్సాపూర్ అభ్యర్థిత్వాన్ని మాత్రం పార్టీ అధినేత కేసీఆర్ పెండింగ్‌లో పెట్టారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి ఈ టిక్కెట్టు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. బుధవారం మెదక్‌లో ప్రగతి శంఖారావం బహిరంగ సభ జరిగిన మరుసటి రోజైన గురువారమే ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తన అనుచరులతో హైదరాబాద్ తరలివెళ్లి హరీశ్‌రావును కలిశారు. టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యేకే కేటాయించాలని మంత్రి నివాసం ముందు అనుచరులు బైఠాయించడం చర్చనీయాంశమైంది. దీంతో సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆర్థిక శాఖ మంత్రి సముదాయించి పంపారు.

ఇప్పటికే ఇద్దరితో మాట్లాడిన అధినేత

మెదక్‌లో జరిగిన ప్రగతి శంఖారావం బహిరంగ సభ వేదికపై కేసీఆర్, మదన్‌రెడ్డితో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆయన అడిగిన వెంటనే నర్సాపూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు సునీతా లక్ష్మారెడ్డి కూడా గురువారం ఆర్థిక మంత్రి హరీశ్‌రావును కలిసేందుకు హైదరాబాద్ తరలివెళ్లినట్లు తెలిసింది. అంతకు ముందే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. ఈనెల 21న బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటించక ముందే వీరిద్దరితో నర్సాపూర్ టికెట్ విషయమై ముఖ్యమంత్రి మాట్లాడినట్లు సమాచారం.

ఇద్దరు కలిసే పార్టీ వ్యవహారాలు

ప్రగతి శంఖారావం బహిరంగ సభకు కార్యకర్తలు, అనుచరులను తరలించే ప్రక్రియను మదన్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఇద్దరు చేపట్టారు. ఏర్పాట్లు పర్యవేక్షణ కోసం నియోజకవర్గానికి ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి వీరితో చర్చించారు. అయితే బహిరంగ సభకు ముందు.. ఈనెల 14న మెదక్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ ఇద్దరూ హాజరుకావడంతో అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అప్పుడే అభ్యర్థిత్వంపై కొంతమేరకు సంకేతాలు అందడంతోనే సునీతా లక్ష్మారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారనే అభిప్రాయం శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ నియోజకవర్గం అభ్యర్థిత్వం విషయంలో నెలకొన్న ఉత్కంఠ, రోజుకో పరిణామం ఆసక్తికరంగా మారుతోంది.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

నారాయణఖేడ్/జహీరాబాద్ : బీఆర్‌ఎస్ నారాయణఖేడ్, జహీరాబాద్ అసెంబ్లీ స్థానాలకు మరోసారి పోటీ చేసేందుకు అవకాశం కల్పించినందుకు గాను ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, మాణిక్‌రావు.. గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు వీరు ధన్యవాదాలు తెలిపారు.





సీఎం కేసీఆర్‌ను పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి

కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం



మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: కార్యకర్తల నిర్ణయం అనుగుణంగా ముందుకు వెళతానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలంలోని చిట్కుల్‌లోని ఎన్ఎంఆర్ యువసేన కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన మద్దతుదారులు వేల సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా జిల్లావ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని అది ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. ఎక్కడికి వెళ్లినా మద్దతిస్తూ గెలిపించుకుంటామని తీర్మానాలు చేస్తున్నారన్నారు. త్వరలోనే ఒక మంచి నిర్ణయం తీసుకుని అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు. రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గంలో ఒక్కరికీ ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్ టిక్కెట్ విషయంలో పునరాలోచించాలని డిమాండ్ చేశారు. అయితే నీలం ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడాలని తన వంతుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి కోటి రూపాయల సహాయాన్ని ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్న అభిమాన నాయకుడు నీలం మధు స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యే పదవికి పోటీ చేయాలని, పటాన్‌చెరు అభిమానులు, సబ్బండవర్గాల వారు, యువత మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. ప్రచారంలో పాల్గొంటామని ఇంటింటా తిరిగి గెలిపించుకుంటామని తేల్చి చెప్పారు. తొలుత చంద్రయాన్ 3 విజయం సాధించిన సందర్భంగా శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ జాతీయ గీతం ఆలపించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, రజక సంఘం, పద్మశాలి సంఘం, యాదవ సంఘం, గౌడ సంఘం, లింగాయత్ సంఘం, వడ్డెర సంఘం, ముస్లిం, రెడ్డి సంఘం, ఎన్ఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రమణ కుమార్

రాజీ మార్గమే సరైనది

- వచ్చేనెల 9న మెగా లోక్‌అదాలత్
- ఎస్పీ ఎం.రమణకుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: రాజీ మార్గమే ఉత్తమం అని, వచ్చే నెల 9న జరిగే మెగా లోక్‌అదాలత్‌లో వీలైనంతం ఎక్కువ కేసుల పరిష్కరించాలని ఎస్పీ ఎం.రమణకుమార్ అధికారులకు సూచించారు. గురువారం పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ విషయమై ఇన్వెస్టిగేషన్ ఏవిధంగా చేయాలన్న విషయాలపై సలహాలు, సూచనలు చేశారు. త్వరితగతిన దర్యాప్తు ముగించి బాధితులకు అండగా నిలవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం వివిధ రకాల ఆన్‌లైన్, మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రజల్లో సైబర్ నేరాలపై చైతన్యవంతం చేయాలన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, వర్టికల్ పనితీరులో మెరుగైన ప్రదర్శన కనబరిచి, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను పరిమిత లిమిట్స్‌లో ఉంచిన ఎస్‌హెచ్‌ఓలను అభినందించారు. ప్రతిభ చూపిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందిస్తామన్నారు. నేరాల అదుపునకు సబ్ డివిజన్లలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని డీఎస్పీలకు సూచించారు. హైవేలు, ప్రధాన కూడళ్లలో, పార్కింగ్ ఏరియాల్లో, పెట్రోల్ బంకుల్లో, దాబాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేలా యజమానులను ప్రోత్సహించాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచనలు చేశారు. డీఎస్పీలు రమేష్ కుమార్, పురుషోత్తం, రఘు, వెంకట్ రామ్‌రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

వెంకటాపూర్ రైతుల నిరసన

పరిహారం కోసం కార్యాలయం చుట్టూ తిప్పకుంటున్నారని ఆవేదన

జహీరాబాద్: అసైన్డ్ భూముల పరిహారమై అధికారుల జాప్యాన్ని నిరసిస్తూ కోహీర్ మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం లోపలికి వెళ్లి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం గ్రామంలో 200 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించారన్నారు. ఇందులో 100 ఎకరాలకు పరిహారం చెల్లించే విషయమై జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజుల నుంచి చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎకరాకు రూ.15లక్షల వంతున పరిహారం అందిస్తామని చెప్పారన్నారు. వెంటనే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న బాధిత రైతులు

ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేయండి

అధికారులకు కలెక్టర్ శరత్ ఆదేశం

సంగారెడ్డి టౌన్: ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ఓటరు నమోదు, మార్పులు చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని, గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ శరత్ అధికారులకు సూచించారు. అలాగే పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నియోజకవర్గ ఏఈఆర్ఓలు, అడిషనల్ ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు ఓటరు జాబితా రూపకల్పన ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రతి కళాశాలకూ వెళ్లి ఎంతమంది నమోదు కాలేదన్నది తెలుసుకోవాలన్నారు. ఆరుగురి కన్నా ఎక్కువ ఓటర్లున్న ఇళ్ల మరోసారి పరిశీలించాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. నిర్ణీత సంఖ్య కన్నా ఓటర్లు పెరుగుతున్నట్లయితే కొత్త పోలింగ్ స్టేషన్‌కు ప్రతిపాదనలు పెట్టాలని సూచించారు. 80 వయో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ సదుపాయం కల్పించిందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ నగేష్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఏఈఆర్ఓలు, అడిషనల్ ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

పటాన్‌చెరు టౌన్: కచ్చితమైన ఓటరు జాబితాకు కృషి చేయాలని కలెక్టర్ శరత్ అన్నారు. పట్టణంలోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్‌లో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ జిన్నారం, రామచంద్రాపురంలో ఓటరు నమోదు తక్కువగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో దివ్యాంగుల ఓటర్లను గుర్తించాలన్నారు. ఇంటింటా తిరిగి వెరిఫికేషన్ చేసే బీఎల్ఓలు యాప్‌లోనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్ఎస్ఆర్ (స్పెషల్ సమ్మరీ రివిజన్) డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో తప్పులు, ఒప్పులను 19 సెప్టెంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీందర్ రెడ్డి, నియోజకవర్గస్థాయి తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం: డీఆర్ఓ నగేశ్

సంగారెడ్డి టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి నగేష్ అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోవృద్ధులకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ, ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేపడుతోందన్నారు. తొలుత ఈవీఎం, వీవీ ప్యాట్ల డెమో చూపారు. మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, నారాయణఖేడ్ ఆర్డీఓ వెంకటేష్, కలెక్టరేట్ ఏఓ పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉండాలి

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆయా మండలం, డివిజన్ పరిధిలో సాగైనా పంటలకు ఎరువులు ఎంత మొత్తం అవసరమో గుర్తించాలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు చేరేలా ఏవోలు, ఏడీఏలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా కొరత ఏర్పడరాదన్నారు. ఈ విషయమై ట్రాన్స్‌పోర్టులో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అందేలా చూడాలని మార్క్‌ఫెడ్ డీఎంకు సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, మార్క్ ఫెడ్ డీఎం శ్రీదేవి, వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి సాగు

- రుతుపవనాల ఆలస్యం
- మొక్కలకు సరిపోని తేమ
- సీజన్‌లో వాన కురిసింది 16 రోజులే
- దెబ్బతిన్న పత్తి, అంతర పంటలు



ఎదగకుండా ఉన్న పత్తి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

జూన్‌లో వర్షాలు ముఖం చాటాయి. జులైతో అరకొర కురియడంతో విత్తనాలు వేశారు. తర్వాత నుంచి వాటి జాడలేదు. దీంతో వానకాలం సీజన్‌లో వేసిన పంటలు దున్నీ రబీకి రైతులు సన్నద్ధమవుతున్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): జూన్‌లో వరుణుడు ముఖం చాటేశాడు. జులై మొదటి వారంలో కురిసిన వానలకు రైతులు సోయా, మొక్కజొన్న, పత్తి, పెసర, మినుము, కంది తదితర పంటల విత్తనాలు వేశారు. మొలకెత్తే దశలో నిరంతరాయంగా 9 రోజులపాటు ముసురు వానతో ఎదుగుదలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీజన్ ప్రారంభమై సుమారుగా 90 రోజులు గడుస్తుండగా కేవలం 16 రోజులే వాన కురిసింది. కంగ్టి, నాగల్‌గిద్దా, మనూర్ తదితర మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు దాదాపు రూ.20 వేల ఖర్చుతోపాటు మొక్కలు చీడపీడల బారిన పడి నాశనం అవుతున్నాయి. నేలలో సరిపడా తేమ లేకపోవడంతో రసాయన, క్రిమిసంహారకాల పిచికారీ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. జిల్లాలో పత్తి అత్యధికంగా 3,48,946 ఎకరాల్లో సాగుచేశారు. సోయా 78,824 ఎకరాలు, అంతర పంటగా.. కంది 80,173 ఎకరాలు, మొక్కజొన్న 13,009, పెసర 9527, మినుము 6,408, జొన్న 637 ఎకరాల్లో వేశారు.

వర్షాభావ పరిస్థితులు

వర్షాభావ పరిస్థితుల రీత్యా వ్యవసాయాధికారులు, ఏఈఓలు పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నేలలో తేమ లేకపోవడంతో వారి ప్రయత్నం కూడా వృథా అవుతోంది. ఇప్పటి వరకు నాలుగు అడుగుల ఎత్తుకు ఎదగాల్సిన పత్తి పంట ఒక్క అడుగు సైతం ఎదగలేదు. పూత దశకు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ పంటలు దున్నివేసి రబీకి సన్నద్ధమవుతున్నారు.

డైనోసార్ పార్క్‌లో షార్ట్‌సర్క్యూట్

స్థానిక కోమటి చెరువు వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డైనోసార్ గురువారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో ఒక బొమ్మ పూర్తిగా దగ్ధమైంది. సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రధానద్వారం వద్ద నిర్మాణం చేపడుతుండగా ఈ ఘటన జరిగింది. - సిద్దిపేటజోన్





షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైన డైనోసార్ బొమ్మ

క్లుప్తంగా

కరెంట్ షాక్‌తో గేదె మృతి

కల్హేర్(నారాయణఖేడ్): కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. కల్హేర్ మండలం అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన మంద శోభన్ పశువులను ఇంటి వద్ద కట్టి ఉంచాడు. తాడుతో తెంపుకున్న గేదె చెరువు వద్ద నీటిని తాగేందుకు వెళ్లింది. అక్కడి నుంచి వస్తుండగా మార్గ మధ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు తగిలి మృత్యువాత పడింది. రూ.70 వేల విలువైన గేదె మృతి చెందడంతో బాధితుడు బోరున విలపించాడు. పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రాష్ట్రస్థాయి పోటీలకు మహతి విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు మహతి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోపీనాథ్‌శర్మ, హెచ్‌ఎం షబానా ముంతాజ్, వైస్ ప్రిన్సిపాల్ శశిధరశర్మ పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్తీక, వినూత్న, అర్చన, అశ్విని, అమాన్, వరుణ్‌లు ఈనెల 26, 27 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీలలో పాల్గొనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఈటీలు తిరుపతి, శ్రీకుమార్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు



గ్యాస్ సిలిండర్ నుంచి వస్తున్న నీరు

జిన్నారం(పటాన్‌చెరు): గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు వచ్చిన ఘటన జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో గురువారం జరిగింది. బాధితుల వివరాలు. గ్రామానికి చెందిన బండమీది లక్ష్మి హెచ్‌పీ గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. 24 రోజుల క్రితం గ్యాస్‌సిలిండర్‌ను వినియోగిస్తుండగా గురువారంతో గ్యాస్ అయిపోయింది. మూడు నెలలు వచ్చే సిలిండర్ 24 రోజులకే అయిపోవటం ఏమిటని లక్ష్మి కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. సిలిండర్‌ను బయటకు తీసి కదిలించటంతో అందులో నీటి శబ్దం వినిపించింది. సిలిండర్‌ను వంపటంతో అందులోంచి నీళ్లు రావటం గమనించారు. సుమారు ఐదులీటర్ల వరకు నీళ్లు వచ్చాయి. ఈ విషయం సంబంధిత డీలర్‌ను గ్రామస్తులు ప్రశ్నించగా సిలిండర్‌లో గ్యాస్ కొన్నిసార్లు నీరుగా మారే అవకాశం ఉంటుందని తెలిపారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూస్తామని డీలర్ వివరణ ఇచ్చారు.

అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: ఇతర జిల్లాల బార్డర్ పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో కమ్యూనికేషన్ కలిగి ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అధికారులు, సిబ్బందికి సూచించారు. సెక్యూరిటీ ప్లాన్, కమ్యూనికేషన్ వ్యవస్థ, రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, ఫంక్షనల్ వర్టికల్ విధుల గురించి గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డివిజన్ల వారీగా సంబంధిత ఏసీబీ కార్యాలయంలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ల వారీగా రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లాఅండ్‌ఆర్డర్ మల్లారెడ్డి, ఏసీపీలు సరేందర్‌రెడ్డి, సతీష్, రమేష్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బందీ నుంచి బడుల్లోకి..

61మంది చిన్నారులకు వెట్టి నుంచి విముక్తి

- ఆపరేషన్ ముస్కాన్‌తో సత్ఫలితం
- నాలుగు డివిజన్లలో నెలరోజుల పాటు కార్యక్రమం



బడికి వెళ్లాల్సిన పిల్లలు పనుల్లో కనిపించొద్దని రాష్ట్ర ప్రభుత్వం 'ఆపరేషన్ ముస్కాన్', 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమాలను అమలు చేస్తుంది. ప్రతీ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, పిల్లలను పనుల్లో పెట్టుకున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నా మార్పు కనిపించడం లేదు. ఇప్పటికీ చాలామంది పిల్లలు వెట్టిలో మగ్గుతున్నట్లు గుర్తించబడటం ఆందోళన కలిగిస్తుంది.

నారాయణఖేడ్: పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయస్సులో పనుల్లో మగ్గిపోతున్న బాలబాలికలకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-9 ముగిసింది. ఈ సందర్భంగా జిల్లాలో బడిబయట ఉన్న 61మంది చిన్నారులను గుర్తించిన అధికారులు వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. బాల కార్మికుల గుర్తింపు, బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా గతనెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బడీడు పిల్లలను పనులనుంచి దూరం చేసి తల్లిదండ్రులకు అప్పగించడం, సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న వారికి ఆపన్నహస్తం అందించడం.. తప్పిపోయిన వారిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం లక్ష్యంగా ముస్కాన్-9 కార్యక్రమం సాగింది. జిల్లా పోలీసుశాఖ, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గాల వారీగా బృందంగా ఏర్పడి ప్రతీ రోజు జిల్లాలోని ఇటుక బట్టీలు, హోటళ్లు, దాబాలు, దుఖాణాలు, బేకరీల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 61మందిని గుర్తించి పనుల నుంచి విముక్తి కల్పించారు.

18 ఏళ్లలోపు వారంతా బాలలే..

ప్రభుత్వం పేర్కొన్న నిబంధనల మేరకు 18ఏళ్ల లోపు వారంతా బాలల కిందే లెక్క. జిల్లాలో వీరు 1.12లక్షల మంది వరకు ఉంటారని అంచనా. ఈ నేపథ్యంలో ఎంతమంది సంపూర్ణంగా హక్కులు పొందుతున్నారు. ఎంతమంది జీవితాలు దుర్భరంగా మారాయి అనే అంశాలను విశ్లేషిస్తారు. పోలీసు, కార్మిక, స్త్రీ, శిశుసంక్షేమం, బాలల సంరక్షణ విభాగం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ఈ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యారు. నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు నాలుగు పోలీసు డివిజన్లకు కలిపి నాలుగు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఏర్పాటైన బృందాలు జిల్లాలోని ఇటుకబట్టీలు, హోటళ్లు, దాబాలు, దుఖాణాలు, ఇతర వ్యాపార సంస్థలు, ఆయా నిర్మాణాలు జరిగే పనుల ప్రాంతాలను సందర్శించారు. ఈ క్రమంలో గుర్తించిన వారిని బాలల సంరక్షణ సమితి ఎదుట ప్రవేశపెట్టి వారి జీవితానికి కొత్తబాటలు వేశారు.



ఆపరేషన్ ముస్కాన్‌లో అధికారులు

పనుల్లో పెడితే చర్యలు



జిల్లాలో బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దు. ఎవరైనా అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనుల్లో కాకుండా బడుల్లో చేర్పించాలి. ఆపరేషన్ ముస్కాన్‌లో 61మంది బాలలు పనుల్లో ఉన్నట్లు గుర్తించి విముక్తి కల్పించాం.

– సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి, సంగారెడ్డి

ప్రతీ ఏడాది నిర్వహణ

కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో ఆపరేషన్ స్మైల్ పేరిట పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బాలకార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి ఆ వ్యవస్థనుంచి దూరం చేసి బడిబాట పట్టిస్తారు. ఇందులో భాగంగా నెలరోజులపాటు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించి పటాన్‌చెరులో అత్యధికంగా 28మంది, సంగారెడ్డిలో 13, జహీరాబాద్‌లో 15, నారాయణఖేడ్‌లో ఐదుగురు బాలకార్మికులను గుర్తించారు. బాలకార్మికులు కనిపిస్తే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబరు 1098, 100కు ఫిర్యాదు చేయవచ్చు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



కిరణ్ కుమార్ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): కుటుంబ కలహాలతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన పుట్ల కిరణ్ కుమార్(32) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా గోదావరి ఖనికి చెందిన అశ్వినితో రెండు నెలల క్రితం వివాహమైంది. వీరిద్దరూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లి అయిన నెలకే వారిద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం కిరణ్ కుమార్ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో నగరంలోని నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. అలాగే గోదావరిఖనిలో అశ్విని కూడా కిరణ్‌కుమార్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈనెల 23న కౌన్సెలింగ్‌కు రావాలని తెలిపారు. 21న అర్ధరాత్రి కిరణ్ కుమార్ సిద్దిపేటలోని తన ఇంటికి వచ్చాడు. తన మేన బావమర్ది పల్లె నరేందర్‌తో కలిసి 22న సాయంత్రం వారు రంగనాయకసాగర్ కట్టపైకి బైక్ మీద వెళ్లారు. కిరణ్ ఫోన్ మాట్లాడుకుంటూ దూరంగా వెళ్లాడు. చాలాసేపు వరకు రాకపోయే సరికి బావమరిది వెళ్లి చూడగా ఫోన్ మాత్రమే కనిపించింది. తన బావ కనిపించలేదు. పోలీసుల కౌన్సెలింగ్‌కు భయపడి పారిపోయి ఉండొచ్చని నరేందర్ భావించాడు. గురువారం రంగనాయక సాగర్‌లో కిరణ్ మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బావమర్ది నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

హవేళీఘనపూర్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లి తండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. తండాకు చెందిన ముడావత్ లలిత(43) ప్రేమ వివాహం చేసుకొని స్వగ్రామంలో నివాసం ఉంటుంది. భర్త జగన్ పదేళ్ల క్రితం మృతి చెందగా తనకున్న ఇద్దరి కూతుళ్లను కూలీ చేసుకుంటూ పోషిస్తుంది. చిన్న కూతురుకు ఇటీవలే వివాహమైంది. తండాలో ఒంటరి జీవితం గడుపుతున్న లలిత తన ఆలనాపాలన చూసేవారు లేరని మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హవేళీఘనపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి మహిళ..

నర్సాపూర్ రూరల్: క్షణికావేశంతో మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నారాయణపూర్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల సునీత (45) బుధవారం రాత్రి భర్త వెంకటేశంతో గొడవపడి గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం ఉదయం గ్రామస్తులు సునీత మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక స్థితి సరిగా లేక ఉరేసుకుని..

చేర్యాల(సిద్దిపేట): ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణ శివారులోని బండపల్లిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాలు. కాలనీకి చెందిన జంగిటి రవి పెద్దకుమార్తె శిరీష(25)కు కోహెడ మండలం నాగసముద్రాలకు చెందిన తూముల సురేష్‌తో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. హైదరాబాద్‌లో నివాసముంటూ ప్రైవేటుఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజులుగా శిరీష మానసిక ఒత్తిడికి గురవడంతో అనారోగ్యం పాలైంది. ఆస్పత్రిలో చికిత్స అందించినా తగ్గకపోవడంతో బండపల్లికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన కంటైనర్

ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు



టిప్పర్ ని ఢీకొట్టడంతో ధ్వంసమైన కంటైనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను కంటైనర్ ఢీకొట్టడంతో ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాలు. మధ్యప్రదేశ్‌కు చెందిన ములుసింగ్ భదౌరియా(41) ధర్మేంద్ర సింగ్ (35) టిప్పర్ డ్రైవర్‌లుగా పనిచేస్తున్నారు. వీరు బెంగళూరులో నివాసం ఉంటున్నారు. వీరితోపాటు మరో ఇద్దరు కలసి నాలుగు టిప్పర్‌లపై నాగపూర్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా బెంగళూరుకు వెళ్తున్నారు. ఇందులో రెండు టిప్పర్లు ముందు వెళ్లిపోగా, వెనుక వస్తున్న రెండు టిప్పర్లలో ఒకటి కొల్లూరు వద్ద బ్రేక్‌డౌన్ అయింది. దీంతో డ్రైవర్లు ములుసింగ్ భదౌరియా, ధర్మేంద్ర సింగ్ కిందకు దిగి టిప్పర్‌కి ఏమైందో చెక్ చూసుకుంటున్నారు. ఆ సమయంలో హర్యానాకు చెందిన కంటైనర్ రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను వేగంగా ఢీకొట్టడంతో పక్కనే ఉన్న డ్రైవర్లు ములుసింగ్ భదౌరియా, ధర్మేంద్ర సింగ్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. హర్యాన రాష్ట్రానికి చెందిన కంటైనర్ డ్రైవర్ రిజ్వాన్, క్లీనర్ ముఫీద్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని ఔటర్ రింగ్ రోడ్ ట్రాఫిక్ పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. రింగ్ రోడ్ ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మూలుసింగ్ (ఫైల్)



ధర్మేంద్ర సింగ్ (ఫైల్)

● రావి ఆకుపై ఇస్రో ఘనత



నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై జాబిల్లిపై దిగిన విక్రమ్ ల్యాండర్, ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ రూపాలను చిత్రీకరించాడు. జయహో భారత్ అని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపాడు. - నారాయణఖేడ్

బావిలో పడి మహిళ మృతి



ఎల్లవ్వ (ఫైల్)

తొగుట(దుబ్బాక): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని కాన్గల్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు. గ్రామానికి చెందిన కుర్మ ఎల్లవ్వ (54)తన పొలంలో కలుపు తీసేందుకు వెళ్లింది. దాహం వేయడంతో సమీపంలోని బావి వద్దకు వెళ్లింది. మోటారు పంపు వద్ద నీళ్లు తాగుతుండగా అదుపుతప్పి బావిలో పడిపోయింది. చుట్టుపక్కన ఉన్న రైతులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆమె నీటిలో మునిగిపోయింది. బావిలో నుంచి మృతదేహాన్ని పైకి తీసుకొచ్చి తొగుట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని శవాన్ని పోస్టుమార్టం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



రామస్వామి (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన హైదరాబాద్‌లో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన కదారి రామస్వామి(37) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని రసూల్‌పురాలో నివాసముంటూ సూరారంలోని ఓ వైన్స్‌లో తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వైన్స్ ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్‌కు ఉన్న ప్లెక్సీని తీస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. అంబులెన్స్‌లో అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

వంట చేస్తూ యువతి..

రామాయంపేట(మెదక్): ఇంటిలో వంట చేస్తూ కరెంట్ షాక్‌కు గురై వివాహిత మృతిచెందింది. బిహార్‌కు చెందిన కరిష్మాబీబీ (22) కుటుంబ సభ్యులతో కలిసి రామాయంపేటలో నివాసం ఉంటుంది. గురువారం మధ్యాహ్నం కరెంటు స్టవ్‌పై వంట చేస్తూ విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ..



గుర్తుతెలియని మహిళ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ జగదీష్ వివరాలు. పటాన్‌చెరు శివారులోని చౌరస్తాలో గురువారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ (45) వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నైట్ డ్యూటీలో ఉన్న ఏఎస్‌ఐకు సమాచారం అందటంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



నాగభూషణం (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మోహన్ వివరాలు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన నాగభూషణం(65)కు రుద్రారం గ్రామ పరిధిలో ఉన్న ఎమ్ ఎస్ఎన్ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. 16వ తేదీ ఉదయం కంపెనీకి వెళ్లి తిరిగి వస్తుండగా లక్డారం సమీపంలో తన ఎలక్ట్రికల్ స్కూటీ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాని బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు వివరాలు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ సమీపంలోని దర్గా ఎదుట ఓ గుర్తుతెలియని వ్యక్తి (37) మృతిచెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. బ్లూ కోట్ పోలీసులు నరసయ్య ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు కాగితాలు, ప్లాస్టిక్ సీసాలు ఏరుకుంటూ వాటిని అమ్మితే వచ్చే డబ్బుతో మందు తాగుతుంటాడని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. అయితే మృతుడి ముక్కులో రక్తం కనిపించడంతో కిందపడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని కోరారు.

కన్నకొడుకే కాలయముడై..

- తల్లిని హతమార్చిన తనయుడు
- పెళ్లి చేయడం లేదని ఘాతుకం
- పది గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు



వెంకటమ్మ(ఫైల్)

ములుగు(గజ్వేల్): మానవత్వం మంటగలిసింది. మాతృప్రేమ, అప్యాయత అనురాగాలు పంచే కన్నతల్లి పెళ్లి చేయడం లేదనే కోపంతో కొడుకే కాలయముడయ్యాడు. మరొకరితో కలిసి గొంతు కోసి, కాళ్లు నరికేసి కిరాతకంగా హతమార్చాడు. ఈ దారుణ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ మైలారంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత (తెల్లారితే గురువారం) జరిగింది. పది గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించి నిందితులిద్దరినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి వివరాలను గురువారం గజ్వేల్ రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, ములుగు ఎస్సై విజయకుమార్ వెల్లడించారు. బండ మైలారం గ్రామానికి చెందిన మిరియాల వెంకటమ్మ(45) భర్త చనిపోగా, చిన్న దుకాణం నడుపుతూ కొడుకు ఈశ్వర్(23)తో కలిసి ఉంటుంది. కూతురు శైలజకు వివాహమైంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు వెంకటమ్మను హత్యచేశారని కూతురు శైలజకు చిన్నమ్మ ఫోన్‌చేసి చెప్పింది. అక్కడికి చేరుకున్న కూతురు మెడ కోసి, రెండు కాళ్లు నరికేసిన స్థితిలో విగతజీవిగా పడి ఉన్న తల్లి మృతదేహాన్ని చూసి బోరుమన్నది. తల్లిని హతమార్చి కాళ్లకున్న వెండి కడియాలు దొంగలించుకుపోయారని ఆమె ములుగు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లితో తరచూ గొడవపడే సోదరుడు ఈశ్వర్, సమీప బంధువు పర్వతం రాము(21)తో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేయగా రూరల్ సీఐ జానకిరాంరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టారు. అనుమానితులైన ఈశ్వర్, రాములను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. తనకు పెళ్లి చేయడం లేదనే కారణంతోనే కొత్తూరుకు చెందిన రాముతో కలిసి తల్లిని హత్యచేశానని, ఎవరికీ అనుమానం రాకూడదనే కాళ్లు నరికి వెండి కడియాలు దొంగిలించామని ఈశ్వర్ నేరం అంగీకరించాడు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, కాళ్ల కడియాలు స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేశామని రూరల్ సీఐ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ జానకిరాంరెడ్డి. పక్కన ఎస్సై విజయకుమార్

సమస్యలు పరిష్కరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నమల్ల రాములు డిమాండ్ చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలను గురువారం ఆరా తీశారు. అనంతరం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో విద్యారంగానికి 12 శాతం నిధుల బడ్జెట్ కేటాయిస్తే, రాష్ట్రంలో కేవలం 6 శాతం కేటాయించి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఐఆర్‌ను ప్రకటించి పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ర్యాకం మల్లేశం, శివాజీ, సతీష్‌రెడ్డి, రాములు, నాగరాజు, శ్రీనాథ్, రాంచంద్రం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

డబ్బు డిమాండ్ చేసిందని..

- అడవిలో చీరతో గొంతు బిగించి మహిళ హత్య
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు



రేణుక(నర్సమ్మ) (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): పనిచేసేచోట పరిచయమైన మహిళతో అక్రమసంబంధం పెట్టుకున్నాడు. ఆపై కొంత కాలం సహజీవనం చేసి కొద్ది రోజులుగా దూరం పెట్టాడు. డబ్బులు డిమాండ్ చేయడంతో పథకం ప్రకారం మాట్లాడదామని పిలిచి అడవిలో గొంతుకు చీర బిగించి హత్య చేశాడు. ఆపై సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ సంఘటన శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల పంచాయతీ చాకరి మెట్టు ఆలయం సమీపంలోని అడవిలో చోటుచేసుకుంది. గురువారం తూప్రాన్ సీఐ శ్రీధర్, శివ్వంపేట ఎస్‌ఐ రవికాంత్‌రావ్ వివరాలు వెల్లడించారు. సదాశివపేటకు చెందిన కొమిరి రేణుక అలియాస్ నర్సమ్మ(30) భర్త శ్రీనుతో విడిపోయి తల్లిగారి ఇంటి వద్ద ఉంటూ పనులకు వెళ్తుంటది. ఆమెకు ఆరేళ్ల కొడుకు ఉన్నాడు. కాగా హత్నూర మండలం పల్పనూర్ గ్రామానికి చెందిన వడ్డె రాములుతో ఇంటి స్లాబ్ పనులు చేసేచోట రేణుకకు పరిచయం అయింది. రాములు కూడా భార్యకు దూరంగా ఉంటున్నాడు. వీరిద్దరి పరిచయం కాస్త సహజీవనంగా మారింది. కొన్ని నెలలుగా రాములును డబ్బులు అడుగుతూ రేణుక గొడవ పడుతూ అతన్ని దూరం పెడుతుంది. ఈ విషయంలో గొడవలు జరుగుతుండగా మాట్లాడుకుందామని ఈనెల 23న చాకరిమెట్టు గుడివద్దకు రేణుకను రమ్మని చెప్పాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా ఆగ్రహించిన రాములు రేణుకను ఆమె చీర కొంగును గొంతుకు బిగించి హత్య చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయి హత్య విషయం పోలీసులకు తెలిపాడు. దీంతో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రవికాంత్‌రావ్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహం వద్ద క్లూస్ టీం ద్వారా ఆధా రాలు సేకరించారు. మృతురాలి తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాములును శివంపేట పోలీసులు గురువారం రాత్రి నర్సాపూర్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి సంగారెడ్డి జైలుకు రిమాండ్ చేశారు.



రేణుక మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ